# పై కోత

చావలి రమేష్



విశాఖపట్టణం - విజయవాడ పాసింజర్ నెమ్మదిగా ద్వారపూడి స్టేషన్‌లో ఆగింది. బాగా ఖాళీగా ఉంది. తను తప్ప ఎవరూ లేని పెట్టెలో కూర్చున్నా డొక యువకుడు. ఇంకా ఎవరైనా ఎక్కితే బాగుండు నన్నట్టుగా చూస్తున్నాడు. నీలం పాంటు వేసుకున్న ఆ యువకుడికి ఇంచుమించు పాతికేళ్ళుంటాయి. గ్లాస్కో పంచె కట్టుకుని, గిరజాల జుట్టుతో చూడటానికి భూకామందులా ఉన్న ఒక ఆసామీ రైలెక్కి, నీలం పాంటు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నాడు. నెమ్మదిగా ఆ పెట్టెలోకి పది పదిహేనుమంది ఎక్కి తలోచోటా సర్దుకున్నారు.

ఆ నీలం పాంటూ, గిరజాల జుట్టూ కాకుండా, ఆ దగ్గరే ఉన్న సీట్లలో ఒక సిల్కు లాల్చీ, ఒక గళ్ళ బుష్‌కోటు, ఒక జరదాకిళ్ళీ, వేరే మరో ఇద్దరూ కూడా ఉన్నారు.

రైలు పధిహేను నిముషాలపైనే ఆగింది.

"క్రాసింగ్ ఉన్నట్టుంది" అన్నాడు గిరజాల జుట్టు స్వగతంగా.

ఎవరూ ఏమీ అనలేదు. ఇంతలో గార్డు ఈల వేయడం, రైలు బయలుదేరటం జరిగింది.

** ** **

"ఊసుపోవటంలేదు, రెండు ఆట లేద్దామేమిటి?" అన్నాడు గళ్ళ బుష్ కోటు జేబులో నుంచి రెండు పేకలు తీస్తూ జర్దా కిళ్ళీ వైపు చూసి.

"పేక తెచ్చారేమిటి, ఇంకేం వేయండి!" అంటూ పక్క ప్రయాణికుడి పూర్వకాలపు ట్రంకు పెట్టె మధ్యకు లాగి, భుజం మీదున్న టర్కీ తువ్వాలు పరిచి, ఆడుకోడానికి ఏర్పాటు చేశాడు సిల్కు లాల్చీ.

"ఇంకో రెండు చేతులుంటే బాగుంటుంది!" అన్నాడు ముక్కలు కలుపుతున్న జర్దాకిళ్ళీ గిరజాల జుట్టువైపు చూసి.

"సరే, వేయండి!" అని తను కూడా ఆటలో చేరాడు గిరజాల జుట్టు.

"ఎంత, పావలా పెడదామా!"

ఆట మొదలైంది.

** ** **

రైలు కొవ్వూరు స్టేషన్ వదిలింది. అంతవరకూ కిటికీ దగ్గరే కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తున్న నీలం పాంటు, పక్కకి తిరిగి కాసేపు ఆడే వాళ్ళని చూశాడు. ఆట బాగా సాగుతోంది.

"నాకు కూడా వేయండి" అన్నాడు నీలం పాంటు.

"కట్ ఫర్ సీట్స్!" అన్నాడు గిరజాల జుట్టు.

అంతా వారివారి కొత్త స్థానాలలో కూర్చుని ఆట మొదలుపెట్టారు.

"స్టేషన్‌కు పెంచుదాం!" అన్నాడు గిరజాల జుట్టు.

ఎవరూ అడ్డు చెప్పలేదు. అంతవరకూ పదీ, ఇరవై నోట్లదాకానే చేతులు మారే ఆటలో ఇప్పుడు యాభై, వంద నోట్లు తరచుగా చెలామణీ అవుతున్నాయి.

"ఆఁ!" అన్నాడు గిరజాల జుట్టు. ఆయన 'ఆఁ' అన్నాడంటే తను డ్రాపు చేశాననీ, మిగతా వాళ్ళు ఆడుకోవచ్చుననీ అర్థం.

"ఆడుకోండి!" అన్నాడు జర్దా కిళ్ళీ తన చేతిలో ముక్కలు మూసి, కింద పెట్టి.

ఆటలు బాగా పడుతున్నాయి. అందరూ చాలా జాగ్రత్తగా ఆడుతున్నారు - ఒక్క నీలం పాంటు తప్పించి. చేతిలో ముక్కలన్నీ జపాను విసనకర్రలా అందరికీ కనిపించేలా నిర్లక్ష్యంగా పట్టుకుని, ఏ ఆటా మానకుండా ఆడేస్తూ, తరచు పెద్ద మొత్తాలు చెల్లిస్తూన్న నీలం పాంటుని చూసి, అక్కడే ఉన్న ప్రయాణికు డొకడు పక్కవాడితో -

"వీళ్లందరూ బాగా చెయ్యి తిరిగిన ఆటగాళ్లు. జాగ్రత్తగా ఆడుతున్నారు. ఆ కుర్రాడు అనవసరంగా వీళ్లతో ఆటకి దిగాడు. వీళ్లంతా కలిసి దోచేస్తారు" అన్నాడు నెమ్మదిగా చెవిలో.

రైలు ఎందుకో నలభై నిముషాలు ఆగిపోయింది గూడెం స్టేషన్ ముందు.

"మీ రెక్కడిదాకా?" అడిగాడు జర్దా కిళ్ళీ గిరజాల జుట్టుని.

"నేను విజయవాడ. మీరో?"

"నేను ముస్తాబాదు!"

"నేను నూజివీడు!' అన్నాడు సిల్కు లాల్చీ.

"నేను గుంటూరు!" అన్నాడు నీలం పాంటు.

"నేను విజయవాడ!" అన్నాడు గళ్ళ బుష్‌కోటు.

** ** **

ఆట జోరుగా సాగుతోంది. జూదంలో ఉన్న మజాయే అది! నెగ్గుతూ వచ్చేవాడికి ఇంకా ఆడి లాభం పెంచుకోవాలని ఉంటుంది.

** ** ** **

రైలు పవర్‌పేట స్టేషన్‌లో ఆగింది. ఆ పెట్టెలోకి బాగా జనం, విశేషించి ముగ్గురు పోలీసులూ ఎక్కారు. పోలీసులు పెట్టె వైపు రావటం ముందే చూసిన సిల్కు లాల్చీ కళ్ళ సైగతో అందరికీ తెలియజేశాడు. పేకలు దాచేసి, ట్రంకు పెట్టె సీటు కిందకు గెంటి ఆట మానేసి సర్దుకుని కూర్చున్నారు అందరూ.

** ** **

నూజివీడులో సిల్కు లాల్చీ దిగిపోయాడు. పోలీసులు కూడా దిగిపోయారు.

"ఆ దిగినాయన ఆటలు బాగా కొట్టాడు!" అన్నాడు గిరజాల జుట్టు.

"మీరూ బాగానే కొట్టారుగా!" అన్నాడు నీలం పాంటు ఉక్రోషంగా. త నొక్కడే బాగా నష్టపోవటం, అందరికన్నా ఎక్కువ లాభం సంపాదించిన గిరజాల జుట్టు ఆ విధంగా అనటం కోపం తెప్పించింది నీలం పాంటుకి.

"పేకాటే అంత! ఓ రోజొస్తుంది, ఓ రోజు పోతుంది!" అన్నాడు జర్దా కిళ్ళీ.

గళ్ళ బుష్ కోటు పేకలు తీసి ముక్కలు పంచటం మొదలుపెట్టాడు.

"నాకొద్దు! మీ రాడుకోండి!" అంటూ చేతిలోకి దినపత్రిక తీసుకున్నాడు నీలం పాంటు.

మిగతా ముగ్గురూ ఆట మొదలెట్టారు.

"ఆట చూడండి!" అంటూ తన చేతిలోని పేక ముక్కలు, తనకీ, ఆట మానేసిన నీలం పాంటుకీ కనబడేలా దగ్గరగా జరిగాడు జర్దా కిళ్ళీ.

"ఆఁ!" అన్నాడు గిరజాల జుట్టు.

**** ** **

జర్దా కిళ్ళీ ముస్తాబాదాలో దిగిపోయాడు. రైలు విజయవాడ చేరింది.

** ** **

ఆ రాత్రి ఎనిమిదీ నలభైకి గిరజాల జుట్టు, గళ్ళ బుష్‌కోటూ, జర్దాకిళ్ళీ విజయవాడలోని డిలైట్ బార్ రెస్టారెంట్‌లో కల్సుకున్నారు. బీరు ఆర్డరు చేశారు. వాళ్ల ముగ్గురి దగ్గరున్న డబ్బూ కలిపి లెక్క చూశారు. మొత్తం నూట రెండు వంద రూపాయల నోట్లూ, అరవయ్యేడు రూపాయల చిల్లరా ఉన్నాయి. బీరు చప్పరిస్తూ అన్నాడు గిరజాల జుట్టు -

"పొద్దున మన ముగ్గురం మొత్తం ఏడువేల రూపాయలతో ఆటలో కూర్చున్నాం. అంటే లాభం మూడువేల రెండు వందల అరవై. అంటే ఒక్కొక్కళ్లకి రావలసింది ..."

"ఆ పోలీసులు రాకుండా ఉంటే కనీసం ఇంకో పది పచ్చ కాగితాలు లాగేవాళ్లం" అన్నాడు జర్దా కిళ్ళీ.

*** ** **

అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకి నూజివీడు బస్టాండ్‌కి దగ్గరగా ఉన్న టీ స్టాల్‌కి చేరాడు నీలం పాంటు. అప్పటికే అక్కడ కూర్చుని టీ తాగుతున్నాడు సిల్కు లాల్చీ. సిల్కు లాల్చీ ఇంకో టీకి ఆర్డరిచ్చాడు నీలం పాంటుని చూసి.

"మనిద్దరం ఇంచుమించు ఏడు వేల రూపాయలు తీసుకున్నాం వాళ్ల ముగ్గురి దగ్గరా! నూటరెండు పచ్చనోట్లు చెలామణీలో పెట్టేశాం! అన్నాడు అంతా లెక్క చూసిన నీలం పాంటు.

ఆ నూటరెండు పచ్చనోట్లూ ఏనాడూ, ఏ బ్యాంకు మొహం చూడలేదు.

"ఆ పోలీసులు రాకుండా ఉంటే కనీసం ఇంకో పది పచ్చనోట్లు మార్చగలిగి ఉండేవాళ్లం!" అన్నాడు సిల్కు లాల్చీ.

★